25న ప్రత్యేక సంగీత విభావరి

అంబర్ పేట, మే 10 : శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో బాసర శ్రీ జ్ఞానసరస్వ తి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమములో కోటి పార్థివలింగస్థూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర మాసోత్సవాన్ని పురస్కరించుకొని మే 25 వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సంగీత విభావరి, నృత్య నీరాజనం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాశర్మ సంధ్య దంపతులు తెలిపినారు. ఆసక్తి గల భరతనాట్యం, కూచిపూడి నాట్య గురువులు మరియు సంగీత విద్వాంసులు (తమ పిల్లలు, విద్యార్థుల) చేత సంగీత విభావరి, నృత్య ప్రదర్శన చేయించ దలచినచో 9948332032లో సంప్రదించి మే 13 లోపు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఎలాంటి ఫీజులు లేవని, ఉచితముగా ఈ కార్యక్రమము నిర్వహిస్తున్నామని అంబికానాథ శర్మ తెలిపారు.

కాచిగూడ ఏసీపీగా హరీశ్‌కుమార్

కాచిగూడ, మే 10: నగరంలోని సీసీఎస్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన వై.హరీశ్‌కుమార్ కాచిగూడ ఏసీపీగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్‌లో ఏసీపీగా విధులు విధులు నిర్వహిస్తున్న హరీశ్‌కుమార్‌ను కాచిగూడ ఏసీపీగా బదులు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన కాచిగూడ ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాచిగూడ డివిజన్ లోని కాచిగూడ, అంబర్ పేట పోలీస్ స్టేషన్ల పరిధిలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని వెల్లడించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

పురుషోత్తం, సీఐ

మెహిదీపట్నం, మే 10 : ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టీ. పురుషోత్తమరావు అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ సిబ్బందిని, అధికారులను సమన్వయం చేస్తూ పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తానన్నారు. మల్లేపల్లి, బజార్ ఘాట్, సీతారాంబాగ్, దారుస్సలాం, ఆగాపుర చార్కాందిల్, అప్జల్ సాగర్ ప్రాంతాలలో గస్తీని ముమ్మరంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. భారత్ పాక్ యుద్ధ నేపథ్యంలో ప్రజలలో అవగాహనను పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఐ పురుషోత్తంరావు తెలిపారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం

బాగ్‌అంబర్‌పేట సాయిమధురానగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- సాయిమధురానగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మే 10 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్‌లో రూ. 22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బస్తీలో గత ఏడాది క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత తాత్కాలిక మరమ్మతులు చేసి ప్యాచ్‌వర్క్ పనులు చేయకుండా వదిలేయడంతో బస్తీవాసులు నిత్యం ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చొరవ తీసుకొని నూతన రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేయించారు. అట్టి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గత కొన్ని నెలలుగా బస్తీలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తలెత్తుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం మురుగునీరు నిలుస్తుందని దీంతో బస్తీవాసులు, వాహనదారులు ప్రయాణం సాగించడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే బతుకమ్మకుంట నుంచి తిలక్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. ఇంకా ఏవైనే సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించడానికి కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, అప్రోజ్‌పటేల్, జె.బాల్‌రాజు, డి.రాంచందర్, శ్రీహరి, శేఖర్, టి.రమేశ్, సునీల్, నరహరి, కోట్ల శివకుమార్, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నారదుడే తొలి తరం పాత్రికేయుడు

సీనియర్ పాత్రికేయులు కొరిడె మహేశ్, గాండ్ల సంపత్, భాస్కర్‌యోగి, డాక్టర్ కే. అనిత, రాఘవేంద్ర లను ఘనంగా సన్మానిస్తున్న సమాచారభారతి అధ్యక్షులు ఆచార్య గోపాల్ రెడ్డి తదితరులు

జియాగూడ, మే 10 : భారతీయ జర్నలిజానికి ఆద్యులు నారద మహాముని అని, ఆయన నుంచి సత్యనిష్ఠ, హితంగా చెప్పడం అన్న లక్షణాలను పాత్రికేయులు అలవర్చుకోవాలని సమాచార భారతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన నారద జయంతి సందర్భంగా వక్తలు సూచించారు. ఓ పాత్రికేయుడికి వుండాల్సిన అన్ని లక్షణాలు నారదునిలో వున్నాయని, అందుకే నారద జయంతిని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. శనివారం కోఠిలోని వై. ఎమ్. ఐ. ఎస్. భవనంలోని వీర సావర్కర్ హాలులో జరిగిన దేవర్షి నారద జయంతి కార్యక్రమానికి అధ్యక్షులుగా సమాచారభారతి అధ్యక్షుడు ఆచార్య గోపాల్ రెడ్డి, ముఖ్య అతిథిగా ఐఎఎఎస్ (రిటైర్డ్) సి.హెచ్.వి. సాయిప్రసాద్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యాభారతి దక్షిణ భారత క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు కొరిడె మహేశ్, గాండ్ల సంపత్, భాస్కర్‌యోగి, డాక్టర్ కే. అనిత, రాఘవేంద్ర లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు ఆచార్య గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... సమాచార భారతి మూడు దశాబ్దాలుగా పత్రికా రంగంపైనే ప్రధానంగా దృష్టి పెడుతోందని, వీటితో పాటు సామాజిక సమరసత, జాతి ఔన్నత్యం, సమగ్రతను పెంచడానికి మీడియా రంగాన్ని సాధనంగా చేసుకుంటోందని వివరించారు. నారద జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జర్నలిజంలో ఉత్తమ విలువలతో వున్న జాతీయ భావాలు గల పాత్రికేయులను సమాచార భారతి పక్షాన సన్మానిస్తున్నామని తెలిపారు. చాలా సంవత్సరాల పాటు విద్యలో భారతీయత అనేదే కనిపించేదే కాదని, కానీ గత 11 సంవత్సరాలుగా కొంత మార్పు కనిపిస్తోందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో విద్యా రంగంలో కొంత మార్పు వచ్చిందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన చామర్తి ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫేక్ న్యూస్ విపరీతంగా వస్తోందని, దీనిని అరికట్టడానికి సమాచార భారతి కృషి చేయాలని అన్నారు. సమాజం ఎదగాలంటే భాగస్వాములందర్నీ కలుపుకుంటూ వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం పిల్లల్లో వివిధ మాధ్యమాల ద్వారా విష బీజాలను నాటుతున్నారని, వాటిని ఎదుర్కోవడానికి పుస్తకాలు, భారతీయ సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాలని సూచించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐ.ఎ.ఎ.ఎస్. (రిటైర్డ్) అధికారి సి.హెచ్.వి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. నారదుడు త్రిలోక సంచారిగా వుంటూ సమాచారాన్ని చేరవేశారన్నారు. పాత్రికేయులు కూడా ఆదర్శ స్థితికి చేరాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఆరెస్సెస్ దక్షిణ మధ్య క్షేత్రం ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్, తెలంగాణ ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్‌తో పాటు సమాచార భారతి కార్యకర్తలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి సారూ!

- కేఫ్ వద్ద వరద నీటి కాలువ పనులను పూర్తి చేసి మరమ్మతులు చేయని వైనం
- అవస్థలు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

లక్కీ స్టార్ హోటల్ వద్ద గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

అంబర్ పేట, మే 10 : అంబర్ పేట శ్రీరమణ చౌరస్తాకు సమీపంలోని లక్కీ కేఫ్ వద్ద జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ వరద నీటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేసి రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. వరద నీటి పైప్ లైన్ ఏర్పాటు కోసం రోడ్డుపై గోతులు తీసిన కాంట్రాక్టర్ పైప్‌లైన్ పనులను పూర్తి చేసి రోడ్డును అలాగే వదిలి వెళ్లాడని తెలిపారు. దీంతో భారీ గోతులు ఉండటంతో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అయినప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో గోతులు కనిపించక వాహనదారులు, పాదాచారులు అందులో పడి గాయాల పాలవుతున్నారని అన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అంబర్ పేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డుపై గుంతలు తీసి పూడ్చకుండా వదిలివేసిన కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకొని రోడ్డుకు మరమ్మతులు నిర్వహించేలా చర్యల తీసుకోవాలని వారు కోరారు.

ఉగ్రవాదులు ఏ మూలన ఉన్నా అంతం చేయాలి

బీఆర్ఎస్ నాయకుడు గోనె ప్రదీప్‌రావు

కాచిగూడ, మే 10 : దేశంలో ఉగ్రవాదులు ఏమూలన ఉన్నా ప్రభుత్వాలు వారిని తుద ముట్టించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోనె ప్రదీప్ రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్ బుద్ధిమారే వరకు ఆపరేషన్ సింధూర్‌ను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ రక్షణలో మేము ఎవరికి తీసిపోం అన్నట్లుగా భారత సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా భారత సైనికులకు అందరూ అండగా నిలబడి ధైర్యాన్ని నింపాలని ఆయన పిలుపునిచ్చారు. శత్రు దేశమైన పాకిస్తాన్ కు భారత సైనికుల సత్తా ఏంటో నిరూపించారని ఆయన పేర్కొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి

డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్ తదితరులు

కాచిగూడ, మే 10: రాజకీయాలకు అతీతంగా డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. బర్కత్పుర బస్ డిపో లైన్ లో కొన్ని రోజులుగా డ్రైనేజ్ పైప్ లైన్ కుంగిపోవడంతో వాహనదారులు, పదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న కాచిగూడ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ సిబ్బందితో శనివారం కుంగిపోయిన డ్రైనేజ్ పనులను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేష్ యాదవ్, నర్సింగరావు, భీమ్రాజ్, నరేందర్, రవి యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

తార్నాక ఎర్రకుంట చెరువు కబ్జాకు యత్నం

పోలీసుల సాయంతో వాటిని తొలగించిన అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక డివిజన్‌లోని ఎర్రకుంట చెరువు కబ్జాకు కొందరు ప్రయత్నించారు. శనివారం తెల్లవారుజాము నుంచి సర్వే నం. 121, 122, 123, 125 లోని 9 ఎకరాలల్లో 250 గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. స్థానికులు సంబంధిత అధికారులు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తక్షణమే అక్కడికి చేరుకున్న అధికారులు పోలీసుల సాయంతో వాటిని తొలగించి, ఆక్రమణలకు ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. తాము భూమిని కొనుగోలు చేశామని, గుడిసెలు వేసుకుంటే అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీ జగన్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థలాన్ని నగర డిప్యూటీ మేయర్, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి పరిశీలించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలను సహించబోమని స్పష్టం చేశారు.

ఏపీ సంపర్క్ క్రాంతి రైల్లో దొంగతనం

కాచిగూడ, మే 10: ఏపీ సంపర్క్ క్రాంతి రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన కె.ఎమ్. శివాని (21)వృత్తిరీత్యా సి.ఆర్.పి.ఎఫ్‌లో కానిస్టేబుల్. ఏపీ సంపర్క్ క్రాంతి రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ఆమె ఖరీదైన ఫోన్, సీఆర్‌పీఎఫ్ ఐడీ కార్డును దొంగలు దొంగిలించారు. శనివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం వర్దా రైల్వే పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురు నిందితుల అరెస్ట్

21 కిలోల గంజాయి స్వాధీనం

వెంగళరావునగర్, మే 10 : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు కొనుగోలుదారులను అరెస్ట్ చేసిన ఎస్. ఆర్. నగర్ పోలీసులు వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్ కు తరలించారు. ఇందుకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రలోని పార్లీ, బర్కత్ నగర్ కు చెందిన అమ్జద్ షేక్ (38) మధ్యప్రదేశ్‌కు చెందిన నాన్సింగ్ పవార్, మధన్ సింగ్ పవార్ల వద్ద గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌తో పాటు తెలంగాణ లోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. శనివారం ఉదయం బల్కంపేట్ బీజేఆర్ నగర్ శ్మశాన వాటిక వద్ద పెద్ద మొత్తంలో గంజాయిని డెలివరీ చేయడానికి వస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్. ఆర్ నగర్ పోలీసులతో కలిసి వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అమ్జద్ షేక్ తో పాటు మూసాపేటకు చెందిన గల్లీ రవి కె. భరత్ ఆటో డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని 21 కిలోల గంజాయి చేసుకొని ఈ ముగ్గురి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ప్రశాంత్ కుమార్ (48) వ్యాపారి. గుండ్లపోచంపల్లి – బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్యన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చూరీకి తరలించారు. మృతుడి జేబులో దొరికిన సెల్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ

సంఘీభావ ర్యాలీలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు

అంబర్ పేట, మే 10: మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న భారత సైన్యానికి మద్దతుగా శనివారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ దుశ్చర్యను నిరసిస్తూ అంబర్‌పేట లోని జ్యోతిబా పూలే విగ్రహం నుంచి శ్రీరమణ చౌరస్తా లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్న భారత సైన్యానికి సంఘీభావంగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ..ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతో పోరాటం చేస్తున్న భారత సైన్యానికి మరింత ఆత్మస్థైర్యాన్ని అందించాలన్నారు. భారత సైన్యం చేపట్టే ప్రతి చర్యకు భారత ప్రజలు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. భారత ప్రధాని చేపట్టిన సింధూర్ ఆపరేషన్‌కు యావత్ భారత్ ప్రజలు అండగా నిలుస్తారని చెప్పారు.

పాకిస్తాన్ బుద్ధిమారే వరకు ఆపరేషన్ కొనసాగాలి..

పాకిస్తాన్ కి గుణపాఠం చెప్పాలని, యువతను పెడదోవ పట్టిస్తున్న పాకిస్తాన్ బుద్ధి మారే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫిరోజ్ ఖాన్, ముజాహిద్‌ఖాన్, ఆర్. లక్ష్మణ్ యాదవ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, పి. నారాయణస్వామి, హరినాథ్‌రెడ్డి, అప్సర్, యూసఫ్, దిడ్డి రాంబాబు, పులి జగన్, గరిగంటి రమేశ్, మోత రోహిత్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, సత్తిబాబు, రామ్మోహన్, రాజేశ్వరరావు, ఠాగూర్ హరి తిలక్సింగ్, కోటం అనిల్, ప్రభాకర్, జమీర్, ఫరీద్, లక్ష్మణ్, మహమ్మద్, విజిత రెడ్డి, కవిత, శ్రీనివాస్ రెడ్డి, షేక్ సమద్, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ సర్ఫరాజ్, అయాన్, మన్మోహన్, వంశీ, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 10 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మ నగర్ కమిటీ హాల్లో శనివారం అయాన్స్ ఫార్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు వైద్య శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని, స్వచ్ఛంద సంస్థలు ఇలాంటివి మరిన్ని నిర్వహించడానికి ముందుకు రావాలని కోరారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రచన శ్రీ, బీజేపీ నాయకులు వెంకటేశ్, శివకుమార్, రాజేశ్, రమణ, సాయి, సాయిలు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తీరుస్తాం

ఎమ్మెల్యే కౌసర్‌ను కలిసిన ఖాదర్‌బాగ్ వాసులు

మెహిదీపట్నం, మే 10 : ప్రజల సమస్యలు తీర్చివారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. శనివారం నానల్ నగర్ డివిజన్ ఖాదర్బాగ్, అల్ హస్నాత్ కాలనీల పెద్దలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తమ కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సీసీ రోడ్డు ఆధునికీకరణ పనులు

మెహిదీపట్నం, మే 10: ప్రజలకు అంతర్గత రోడ్లను నిర్మించడానికి జీహెచ్ఎంసీ సర్కిల్ 13 ఇంజినీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కార్వాన్ నియోజకవర్గం నాన్నల్ నగర్ డివిజన్ లోని సాలార్జంగ్ కాలనీలో వీడీసీసీ రోడ్‌ను ఆధునికీకరించే పనులను చేపట్టారు. శనివారం ఈ పనులను కార్పొరేటర్ నసీరుద్దీన్ పరిశీలించారు.

అహ్మద్‌నగర్‌లో వీడీసీసీ రోడ్డు..

మెహిదీపట్నం, మే 10 : ప్రజల సౌకర్యం కోసం మౌలిక సదుపాయాలు కల్పించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. అహమ్మద్ నగర్ డివిజన్లోని శ్రీరామ్ నగర్ కాలనీలో రూ. కోటి 35 లక్షలతో నిర్మించిన బీడీసీసీ రోడ్డును ఎమ్మెల్యే స్థానిక నాయకులు సర్ఫరాజ్ సిద్ధికి, నాసర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఇన్ స్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. శనివారం హిమాయత్ నగర్‌లోని అటేనాస్ ప్రెటర్నిటీ నేషనల్ ఏవియేషన్ అకాడమీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడంతో ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. త్రిబుల్ రైడింగ్, అతివేగం, సిగ్నల్ జంపింగ్, ఫోన్ మాట్లాడుతూ వాహ నాలను డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అకాడమీ సీఈఓ, డైరెక్టర్, సెంటర్ హెడ్ సురేఖ, టీటీఐ సిబ్బంది పాల్గొన్నారు. – హిమాయత్‌నగర్